# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ఫోన్లపై కేంద్రం నిఘా?

దేశవ్యాప్తంగా విపక్ష నేతల యాపిల్ ఫోన్లకు హ్యాకింగ్ హెచ్చరికలు రావడంపై రాజకీయ దుమారం చెలరేగింది. ప్రభుత్వం తమపై ఓ కన్నేసి ఉంచిందని, తమ ఫోన్ల సంభాషణలు చెవియొగ్గి వింటున్నదని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పోషణలో ఉన్న హ్యాకర్లు మీ ఫోన్లలోని సమాచారాన్ని దొంగిలించ జూస్తున్నారన్న' హెచ్చరికలు పలువురు విపక్ష ఎంపీలకు, నేతలకు వచ్చాయి. దాంతో వారు తమపై ప్రభుత్వం నిఘా వేస్తున్నదని ఆరోపించారు. శశి థరూర్, మహువా మొయిత్రా తదితరులు ఎక్స్‌లో ఆ సందేశాలను పోస్టు చేశారు. కొందరు నేరుగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు కూడా. యాపిల్ హెచ్చరికలు రాజకీయ నాయకులకే పరిమితం కాలేదు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరంతరం విమర్శించే 'ది వైర్' వెబ్‌సైట్ వ్యవస్థాపక సంపాదకుడు సిద్ధార్థ వరదరాజన్‌కు కూడా యాపిల్ సందేశం రావడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. తాజా హ్యాకింగ్ ఉదంతంతో డిజిటల్ ప్రపంచంలో గోప్యత, ప్రభుత్వ పాత్రపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

'ప్రభుత్వ పోషణ'లోని అనే మాటపై యాపిల్ కంపెనీ వివరణ ఇస్తూ, 'హ్యాకింగ్ ప్రయత్నాలు జరిగినప్పుడు యాంత్రికంగా అలాంటి సందేశాలు వెళ్తాయని, ఇదమిద్ధంగా ఫలానా ప్రభుత్వమని చెప్పలేమని' పేర్కొనడం గమనార్హం. అంటే భారత ప్రభుత్వ పాత్ర ఉందో లేదో తెలియదని తప్పించుకోవడమన్న మాట. వేరే దేశాల ప్రభుత్వాలకు ఇక్కడి విపక్ష నేతల సమాచారం రాబట్టుకోవాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న ఉదయిస్తుంది. నిన్న గాక మొన్న పెగాసస్ స్పైవేర్ వివాదం కలకలం రేపిన సంగతి తెలిసిందే. 50 వేల పైచిలుకు ఫోన్లపై పెగాసస్ ద్వారా నిఘా పెట్టారని ఆరోపణలు వచ్చాయి. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సాంకేతిక కమిటీ దర్యాప్తు కూడా జరిగింది. ఆ దర్యాప్తులో ప్రభుత్వం సరిగా సహకరించలేదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించడం తెలిసిందే. ఇప్పటికీ పెగాసస్ వివాదం అపరిష్కృతంగానే ఉండిపోయిందన్నది గుర్తుంచుకోవాలి.

ఈ నేపథ్యంలో యాపిల్ హ్యాకింగ్ సందేశాలు సహజంగానే ఆందోళన కలిగిస్తున్నాయి. ఓవైపు మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కారు విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొని కుటిల రాజకీయాలు చేస్తున్నది. కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్ష నేతలపైకి ఉసిగొల్పడం, దర్యాప్తు పేరిట, కేసులపేరిట వేధింపులకు గురిచేయడం గురించి అనునిత్యం వింటూనే ఉన్నాం. దేశ పరిస్థితులు ఎమర్జెన్సీ రోజుల కన్నా ఘోరంగా తయారయ్యాయని విపక్షాలు ధ్వజమెత్తడంతో ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితిలో పడింది. ఈ అంశాన్ని ప్రభుత్వం తీవ్రమైనదిగా పరిగణిస్తున్నదని, దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తామని కేంద్ర సమాచార ప్రసార శాఖామంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరణ ఇచ్చుకోవడం గమనార్హం. నిజానికి ఇదేదో బీజేపీ సర్కారుకే పరిమితమైన అంశమని భావించడానికి వీల్లేదు. విషయంలో కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేనని చెప్పాలి. రెండు పార్టీలు చేసుకున్న పరస్పర ఆరోపణలే ఈ సంగతిని వెల్లడిస్తున్నాయి.

# కాంగ్రెస్‌కు అంత సీన్ లేదు!

'దున్నపోతుకు సున్నమేస్తే ఆవు అయితదా' అని మన తెలంగాణలో ఒక సామెతున్నది. కాంగ్రెస్ కూడా అంతే. కాంగ్రెస్ సమైక్యరాష్ట్రంలో 11 సార్లు అధికారంలో ఉన్నది. నాటి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది. ఇందిరాగాంధీ స్వయంగా మెదక్ నుంచి పోటీ చేశారు.

అంత తిరుగులేని అధికారం చేతుల్లో ఉన్నప్పుడే తెలంగాణ ప్రాంతానికి ఏమీ చేయలేని అత్యంత అసమర్థ, బాధ్యతారాహిత్య నాయకత్వానికి పరాకాష్ట అయిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఒక్క చాన్స్ ఇస్తే ఏమో చేస్తుందంటే నమ్మడానికి తెలంగాణ ప్రజలు ఒకప్పటిలా అమాయకులు కారు. ఒక్కచాన్స్ ఇచ్చి చూడటానికి ఇదేం సినిమా కాదు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు. తెలంగాణ ప్రజల జీవితం.



మనోహర్ చిమ్మని



కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్తున్న ఆరు గ్యారెంటీల్లో కనీసం ఒక్క గ్యారెంటీనైనా అమలు చేయడానికి అవసరమైన కనీస అవగాహన, గణాంకాలు ఏ ఒక్క కాంగ్రెస్ నాయకునికైనా తెలుసా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. కనీసం ఒక్క గ్యారెంటీ గురించైనా కేసీఆర్, కేటీఆర్‌లా తడుముకోకుండా సంపూర్ణ అవగాహనతో చకచకా అవసరమైన గణాంకాలను ఆశువుగా చెప్పగల ఆత్మవిశ్వాసం తెలంగాణ కాంగ్రెస్ నాయకుల్లో ఏ ఒక్కరికైనా ఉన్నదా? అన్నది కూడా ఒక జవాబు దొరకని ప్రశ్నే.

అసలా ఆరు గ్యారెంటీల ఆలోచన కాంగ్రెస్‌కు రావడానికి కారణం కేసీఆర్ కాదా? ఆయన ఆలోచనల్లోంచి పుట్టి, రాష్ట్రంలో అద్భుతంగా అమలవుతున్న అనేక అభివృద్ధి, సంక్షే మ కార్యక్రమాలు కాదా? ఇప్పుడు మూడోసారి కూడా కేసీఆర్ గెలిస్తే ఇంక మాకు పుట్టగతులుండవు అన్న భయం కా దా? ఎప్పుడైనా దున్నపోతు దున్నపోతే, ఆవు ఆవే అన్న నిజం తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు. పోనీ, గతాన్ని పక్కన పెడుదాం. ప్రస్తుతం దేశంలోని కాంగ్రెస్ పాలిత రాష్ట్రా ల్లో ఈ గ్యారెంటీలను ఇప్పటివరకు వీళ్లు ఎందుకు అమలు చేయడం లేదు? జవాబుందా? కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత జిల్లాలోనే నీళ్లు లేవు, రోడ్లు లేవు, కరెంటు లేదు. ఆయన వచ్చి ఇక్కడ ఏ అర్హతతో ప్రచారం చేస్తున్నారు?

రైతులకు 24 గంటలు కరెంటు ఎందుకు, 3 గంటలు సరిపోదా అని రైతు విలువ తెలియని అహంకారంతో మాట్లాడిన మనిషే, ఇప్పుడు ఎలక్షన్స్ వచ్చేటప్పటికి మేము కూడా రైతులకు 24 గంటలు కరెంటు ఇస్తాం అంటున్నాడు. బస్సు రెడీగా ఉంది, మా పార్టీ పాలిస్తున్న కర్ణాటకలో చూపిస్తా పద! అని రేవంత్ రెడ్డి అన్న కొన్ని గంటల్లోనే కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మేము రైతులకు 5 గంటలే కరెంట్ ఇస్తున్నాం అని ఆ పార్టీ బహిరంగ సభలో రేవంత్ రెడ్డి సమక్షంలోనే నిజం చెప్పి, వాళ్ల పార్టీ ఇజ్జత్ తీసిన విషయం నిజం కాదా?

> కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయామని అక్కడి రైతులే స్వయంగా తెలంగాణ సరిహద్దుల్లోని నారాయణ ఖేడ్, వికారాబాద్ లాంటి ప్రాంతాల్లోకి వచ్చి తెలంగాణ ప్రజలను అలర్ట్ చేస్తూ ర్యాలీలు తీయడమనేది బహుశా ఇటీవలి రాజకీయాల్లో ఒక ప్రత్యేక సంఘటన. ఒక చారిత్రక విశేషం.

కాంగ్రెస్‌కు ఓటేయడం ద్వారా అక్కడి రైతులు ఎంత నష్టపోయుంటారు? వారికి ఎంత కడుపు మండి ఉంటే పక్క రాష్ట్రంలోకి వచ్చి మరీ ఇక్కడి ప్రజలు తొందరపాటులో తప్పుచేయకుండా ఉండటం కోసం ఇలాంటి ర్యాలీలు తీయాలనుకుంటారు?

కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎప్పుడో మొత్తం అభ్యర్థులను ప్రకటించింది. సుడిగాలి పర్యటనలతో కేసీఆర్ దాదాపు ప్రతిరోజూ వివిధ నియోజకవర్గాల బహిరంగసభల్లో పాల్గొంటున్నారు. అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఇప్పటికే రెండు రౌండ్ల ప్రచారం పూర్తిచేశారు. మరోవైపు కాంగ్రెస్ తమ పార్టీ అభ్యర్థుల రెండో లిస్టు వరకు మాత్రమే ప్రకటించింది. అసంతృప్తుల కోపానికి పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌తో పాటూ, అభ్యర్థులను ప్రకటించిన అన్ని చోట్లా పార్టీ కార్యాలయాల్లో తిరుగుబాట్లు, విధ్వంసాలు భారీ ఎత్తున జరుగుతున్నాయి. అసెంబ్లీ టికెట్లను కోట్ల రూపాయలకు అమ్ముకొంటూ రేవంత్‌రెడ్డి గాంధీ భవన్‌ను షాపింగ్ మాల్ చేశాడని ఆయన ఫ్లెక్సీలను చించేశారు. కార్యాలయాలను ధ్వంసం చేశారు. వాటికి తాళాలు కూడా వేశారు.

నిజంగా అర్హులైనవారికి పార్టీ టికెట్లు ఇవ్వలేదని, ఇదంతా ఢిల్లీలో ఏఐసీసీ హెడ్‌క్వార్టర్స్ ఆశీస్సులు లేకుండా రేవంత్ రెడ్డి ఒక్కడే చేయలేడని నిర్ధారించుకున్న కాంగ్రెస్ నేతలంతా ఆ పార్టీలో తమ ఉనికి గురించి పునరాలోచించుకుంటున్నారు. ధనబలం ఉన్నవారికే కాంగ్రెస్ టికెట్స్ ఇస్తుండటంతో ప్రజాబలం ఉన్న నాయకులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్తున్నారు. ఇలాంటి నాయకులందరికీ బీఆర్ఎస్ ఒక భరోసానిచ్చే పార్టీగా కండ్లముందు కనిపిస్తున్నది. పొన్నాల లక్ష్మయ్య, నాగం జనార్దన్‌రెడ్డి వంటి సీనియర్ నాయకులు ఇప్పటికే ఆ పార్టీ నుంచి బయటపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన అన్ని నియోజకవర్గాల్లోనూ కార్యకర్తలంతా రెండుమూడు గ్రూపులుగా విడిపోయి వేర్వేరు కుంపట్లు పెట్టుకున్నారు. పైన ఆదిలాబాద్ నుంచి కింద ఖమ్మం దాకా, రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ పార్టీలో అసంతృప్త జ్వాలలు ఇంకా ఇంకా ఎగిసిపడుతూనే ఉన్నాయి. ఫలితంగా ఏం జరుగబోతుందో ఊహించవచ్చు. ఇలాంటి నేపథ్యంలో కూడా కాంగ్రెస్ భారీ మెజారిటీతో గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనుకోవడం ఒక పిచ్చి భ్రమ.

> 2009లో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని ముందు ప్రకటించి, తర్వాత ఆంధ్ర లాబీల ఒత్తిడికి తలొగ్గి మళ్ళీ వెనక్కిపోయింది కాంగ్రెస్సే. దరిమిలా మరొక్కసారి వందలాది మంది విద్యార్థుల బలిదానాలకు కారణమైంది కూడా కాంగ్రెస్సే. కాంగ్రెస్సే తెలంగాణ ఇచ్చిందంటూ ఇప్పుడు మైకుల్లో మొత్తుకుంటున్న కాంగ్రెస్ వాళ్లందరికీ నిజమేంటో బాగా తెలుసు. కాంగ్రెస్ తెలంగాణను ఇవ్వలేదు, కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ ఉద్యమ తీవ్రతకు తలొగ్గి మరొక దారిలేక ఇవ్వాల్సి వచ్చింది.

ఎలక్షన్స్ వస్తే చాలు, డజన్ మంది సీఎం క్యాండిడేట్స్ ఎప్పుడూ కొట్టుకొంటూ తిట్టుకొంటూ సొంత కుంపట్లతో సిద్ధంగా ఉండే కాంగ్రెస్ పార్టీలో, వాళ్లకు వాళ్ళు వాపును చూసి బలుపు అనుకుంటే ఎవరికీ నష్టం లేదు. తెలంగాణ ప్రజలు అలా అనుకోరు. ఏది వాపో ఏది బలుపో వారికి బాగా తెలుసు.

ఒక తిరుగులేని ఉద్యమనాయకునిగా కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఆవిర్భావం తర్వాత, తెలంగాణలో కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి వచ్చేంత సీన్ ఇప్పుడప్పుడే లేదు. దేశంలో అంతకుముందున్న అన్ని రికార్డులను చెరిపేస్తూ, ఇంతకుముందు ఎవ్వరూ కనీసం ఆలోచించని అనేక అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ, తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారు ముఖ్యమంత్రి కేసీఆర్. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో కూడా భారీ మెజారిటీతో గెలవడం ఖాయం. ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం.

కాంగ్రెస్, ఆ పార్టీ గ్యారెంటీల గురించి కేసీఆర్ మాటల్లోనే చెప్పాలంటే 'నా అంత సిపాయి లేడని తుపాకి రాముడు చెప్పే కథలు అవన్నీ'. కాంగ్రెస్ అనేది ఇప్పుడు తెలంగాణలో ఒక ఒడిశిన కథ.

# సుస్థిరత కోసమే చేరికలు

గత కొద్ది రోజుల నుంచి వివిధ పార్టీలకు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు చాలామంది స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్, బీజేపీల్లో ఉన్నత స్థాయిల్లో పనిచేసిన వారంతా ఆ పార్టీలను ఎందుకు వీడుతున్నారు? వారు చేరడానికి బీఆర్ఎస్‌నే ఎందుకు ఎంచుకుంటున్నారు? వారంతా కేసీఆర్ నాయకత్వాన్ని మాత్రమే ఎందుకు కోరుకుంటున్నారు? జాతీయ పార్టీలను, తమ అనుభవాలన్నీ వదిలిపెట్టి ఏ లక్ష్యం కోసం బీఆర్ఎస్‌లో చేరుతున్నారు? ఎన్నికల వేళ ఈ చేరికలు దేనికి సంకేతం? అనే కోణంలో తెలంగాణ బుద్ధిజీవులు, మేధావులు చర్చించుకుంటున్నారు.



వెంకట్, గుంటిపల్లి
94949 41001



బీఆర్ఎస్‌లో చేరుతున్న నేతలంతా కూడా నాలుగైదు దశాబ్దాల నుంచి రాజకీయాల్లో ఉన్నవారు. అనేక పదవులను అనుభవించిన వారు. గత పాలనలను చూసి, తెలంగాణ రాష్ట్రం వచ్చిన అనంతరం తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనను చూసి మంచి, చెడు బేరీజు వేసుకునే ఈ చేరికలు జరుగుతున్నాయని స్పష్టమవుతున్నది. ఈ చేరికలను ఏదో పార్టీల ఫిరాయింపుల్లా, రాజకీయ అవసరాలు, అవకాశాల కోణంలో చూస్తే దానంత మూర్ఖత్వం మరొకటి ఉండదు. ఓ సుస్థిర ప్రభుత్వం కోసం, సమర్థవంతమైన పాలన కోసం, నమ్ముకున్న జనాల్ని ఉద్ధరించడం కోసం ఈ చేరికలు జరుగుతున్నాయన్నది సుస్పష్టం. జీవితంలో ఎన్ని పదవులు అనుభవించామన్నది ముఖ్యం కాదు...నమ్ముకున్న వారికోసం ఏం చేశామన్న అవలోకనాల అనంతరమే జరుగుతున్న చేరికలు. మంత్రులుగా పని చేసిన వారు, రాష్ట్రం కోసం ఉద్యమించిన వారు సుస్థిరత కోసం, తెచ్చుకున్న తెలంగాణ బలంగా ఉండడం కోసం ఈ చేరికలు జరుగుతున్నాయని స్పష్టంగా తెలుస్తున్నది. తెలంగాణ రాష్ట్రం కావాలని, రావాలని తొలిదశ ఉద్యమం నుంచి ఆకాంక్షించి వేర్వేరు వేదికల నుంచి తమ గళం వినిపించిన వారు కొందరు. మలిదశ ఉద్యమంలో కేసీఆర్‌తో పనిచేసి ఇతర పార్టీల్లో చేరిన వారు కొందరైతే, పార్టీలు పెట్టి మరీ ఉద్యమించిన వారు మరికొందరు. వీరంతా నేడు మూకుమ్మడిగా భారత రాష్ట్ర సమితిలో చేరి గులాబీ కండువాలు కప్పుకుంటున్న తీరును తెలంగాణ సమాజం హర్షిస్తున్నది.

> అనేక కొట్లాటలు, పోరాటాలు, లాబీయింగ్, రాజకీయ సంఘర్షణల అనంతరం కేసీఆర్ తెచ్చిన తెలంగాణ సుస్థిరంగా ఉండాలన్నది తెలంగాణ బుద్ధి జీవుల ఆకాంక్ష. అందుకు అనుగుణంగా తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చి దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపారు కేసీఆర్.

ఈ క్రమంలోనే తెలంగాణలో రాజకీయ అస్థిరత సృష్టించేందుకు పలు రూపాల్లో కుట్రలు జరుగుతున్నాయి. అందుకే బీఆర్ఎస్‌కు సొంత మెజారిటీ ఉన్నా తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకునేందుకు పార్టీలు, జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి అంతా కలిసి రావాలని అనేక సందర్భాల్లో సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. సుస్థిర తెలంగాణ బాగు కోసం రాజకీయ పునరేకీకరణ జరుగాలని కేసీఆర్ పదే పదే చెప్తున్నారు.

అయినప్పటికీ రాజకీయ అస్థిరత్వం సృష్టించాలని కుట్రలు నాడు నేడు కూడా జరుగుతున్నాయి. ఎమ్మెల్యేల కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. ఒక దశలో రాష్ట్రపతి పాలన విధించే ప్రయత్నాలు కూడా జరిగాయి. అయినా రాజకీయ పునరేకీకరణ జరుగుతూ వస్తున్నది. 2014 ఎన్నికల తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతునిస్తూ వస్తున్నది మజ్లిస్ పార్టీ. 2014 శాసన సభలో టీఆర్ఎస్ బలం 63. మజ్లిస్ పార్టీ మద్దతు ఎలాగు ఉన్నది. ఆ తర్వాత కేసీఆర్ పాలన చూసి చాలామంది బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ ఏకంగా 88 సీట్లు గెలిచింది. అయినా పలు పార్టీల నుంచి పలువురు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరారు.

ఈ క్రమంలో కేసీఆర్ తను ఇచ్చిన మాట ప్రకారం పార్టీని నమ్ముకున్న ప్రతి సిట్టింగ్ ఎమ్మెల్యేకు, ఇతర పార్టీల నుంచి వచ్చిన ప్రతి శాసన సభ్యుడికి మళ్లీ పోటీ చేసే అవకాశం కల్పించారు. అప్పుడు ఇప్పుడూ చేరినవారితో పాటు, చేరబోతున్న వారూ, తమ నియోజకవర్గ, రాష్ట్ర అభివృద్ధికోసం మాత్రమే బీఆర్ఎస్‌లో చేరుతున్నారు.

తన రాజనీతి, చాణక్యంతో కుట్రలను ఓ వైపు పసిగడుతూనే బాగుపడుతున్న తరుణంలో బతికి చెడకూడదని మరో వైపు హెచ్చరిస్తూ ఆ కుట్రలను ఛేదిస్తున్నారు ముఖ్యమంత్రి కేసీఆర్. కేసీఆర్ నాయకత్వాన్ని అస్థిర పరిచి అభాసుపాలు జేసేందుకు ఇప్పటికీ కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన మాజీ పీసీసీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య, మాజీ మంత్రులు నాగం జనార్దన్ రెడ్డి, చంద్రశేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి సహా అనేక మంది మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, ఉద్యమకారులు పార్టీ కండువాలు కప్పుకుని ఇప్పుడు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉన్నామని ఊపిరి పీల్చుకుంటున్నారు. తెలంగాణ కోసం పోరాడిన దాసోజు శ్రావణ్, చెరుకు సుధాకర్, జిట్టా బాలకృష్ణా రెడ్డి, దరువు ఎల్లన్న, ఏపూరి సోమన్న లాంటి కరుడు గట్టిన ఉద్యమకారులు బీజేపీ, కాంగ్రెస్‌ల్లో ఇమడలేకపోయారు. కేసీఆర్ పాలన, కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీఆర్ఎస్‌లో చేరారు.

> ఎంతో రాజకీయ అనుభవం ఉన్న పొన్నాల లక్ష్మయ్య సొంత పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఏడు పదుల వయసులో పదవులతో పనిలేకుండా నాడు - నేడు అనే ఒకే ఒక్క ట్యాగ్‌లైన్‌లో సమగ్ర విశ్లేషణ జరిపి మేధోమథనం అనంతరం పార్టీ మారాలని నిర్ణయం తీసుకుని సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

అలాగే మరో మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి వైద్యారోగ్యమంత్రి సహా పలు కీలక శాఖల్లో పని చేశారు. ఆయన కూడా నాటి ఏపీ, నేటి తెలంగాణను, రాజకీయ స్థిరత్వాన్ని బేరీజు వేసుకుని బీఆర్ఎస్‌లో చేరారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ప్రముఖులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయా పార్టీలను విడిచిన ఉద్యమకారులది ఒక్కొక్కరిది ఒక్కో అనుభవం. సుస్థిర తెలంగాణాభివృద్ధి కోసం సదరు నేతలంతా కేసీఆర్ దరికి వస్తున్నారు.

ఇవాళ తెలంగాణ పునర్నిర్మాణాన్ని తెలంగాణ సమాజం దగ్గరగా చూస్తున్నది. అందుకే ఇప్పుడు కూడా ఏదో ఎన్నికలు, ఓట్లు , సీట్లు అని కాకుండా సుస్థిర ప్రభుత్వం కోసం మరో రాజకీయ పునరేకీకరణ జరుగుతున్నది.

ఈనాడు మనదేశంలో యువతను పట్టి పీడిస్తున్న రెండు ప్రధాన సమస్యల్లో ఒకటి నిరుద్యోగ సమస్య, మరొకటి ఉపాధి అవకాశాలు లేకపోవటం. ఈ రెండు మనిషి గౌరవంగా తలెత్తుకొని బతకటానికి కావాల్సిన కనీస అవసరాలు. ప్రపంచంలో నేడు ఏ దేశానికీ లేనంత యువశక్తి భారతదేశానికి ఉన్నది. వారిలో ఉన్నత చదువులు చదివిన లక్షలమంది నిరుద్యోగులుగా, ఉపాధి అవకాశాలు లేక బాధపడుతున్నారు.

# యువతకు శాపంగా మోదీ విధానాలు



కోలాహలం రామ్‌కిశోర్
98493 28496



ప్రధాని మోదీ తొమ్మిదేండ్ల పాలనలో 2023 జూలై నాటికి కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం నిరుద్యోగిత రేటు పెరుగుతూ పోయింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) ప్రకారం నేటికి దేశంలో నిరుద్యోగిత రేటు 7.95 శాతంగా ఉన్నది. పట్టణ ప్రాంతంలో 7.93, గ్రామీణ ప్రాంతంలో 7.44 శాతంగా ఉన్నది.

చదువుకున్న యువత ఒకవైపు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకక, వయసు మీద పడటంతో పెండ్లిండ్లకు దూరమవుతున్నారు. పెండ్లయిన వారు కుటుంబాలను పోషించలేక ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అవమానాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వాస్తవం ఇలా ఉంటే మోదీ మూఢభక్తులు మాత్రం అంతా సక్రమంగా, ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్‌తో కొనసాగుతుందంటూ సోషల్ మీడియా గ్రూపుల్లో నీరాజనాలు అర్పిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వంలోని, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలు, ఆర్‌బీఐ, ప్రైవేటు పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ సంస్థల నివేదికలు ప్రకటించిన గణాంకాలు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. మోదీ వర్గం ప్రచార వ్యూహంలో పడిపోయి, నిత్యజీవితంలో ఎదురయ్యే యువతీ, యువకుల నిరుద్యోగ, ఉపాధి సమస్యలను కండ్లారా చూస్తూ కూడా మోదీని ఆరాధించటం. ఆయన పాలనకు వంత పాడటం విచిత్రం.

పార్లమెంటులోగానీ, మన్ కీ బాత్‌లోగానీ, ఎన్నికల ప్రచార సభల్లో కానీ మోదీ చేసే ప్రసంగాల్లో దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను ఎక్కడా ప్రస్తావించరు. దేశం ఎదుర్కొనే ప్రతి కీలక సమస్యపై మోదీ మౌనం దాల్చుతారు. దేశ సమైక్యతకు, సమగ్రతకు ఎంతమాత్రం పనికిరాని,అవసరంలేని హిందుత్వం, హిందూ మతోన్మాదం వంటి అంశాలలో, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉపన్యాసాలు ఇస్తారు. దేశ ఆర్థిక పురోగతికి ఉద్యోగ, ఉపాధి రంగాలే కీలకం. గతంలోఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో దేశంలో నిరుద్యోగం 47 ఏండ్ల గరిష్ఠానికి చేరుకున్నది. 18-25ఏండ్ల లోపు పట్టభద్రుల్లో నిరుద్యోగిత గణాంకాలు చూస్తే ఏకంగా 42 శాతానికి చేరుకున్నది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాలలో ఎక్కడ చూసినా నిరుద్యోగం, ఉపాధి కొరత విలయ తాండవం చేస్తున్నది. ఉన్నత చదువులు చదివిన వారికి వృత్తినైపుణ్యాలు కొరవడ్డాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో నూతన పెట్టుబడులు తిరోగమనంలో ఉన్నాయి. ముఖ్యంగా డీమానిటైజేషన్ ప్రభావం నేటికీ కనిపిస్తున్నది. 65 శాతం జనాభా ఆధారపడిన వ్యవసాయ రంగంలో పేలవమైన ఉత్పాదకతను చూపిస్తుంది. ధనికులు మాత్రం విదేశీ బాట పడుతున్నారు.

'తమకు ఉపాధి దొరకదని నిరాశతో యువత కనీసం పేపర్లలో వచ్చే ఉద్యోగ ప్రకటనలకు దరఖాస్తులు కూడా చేసుకోవడంలేదు. అంతగా యువతను మానసిక కుంగుబాటుకు గురిచేసింది ఈ కేంద్ర ప్రభుత్వం'అని 'అజీజ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ' కి చెందిన సెంటర్ ఫర్ సస్టెయినబుల్ ఎంప్లాయిమెంట్ సంస్థ చేసిన సర్వే నివేదిక వెల్లడించింది. అలాగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాను విడుదల చేసిన ప్రకటనలోనూ ఈ సమస్య తీవ్రతను వెల్లడించింది. అయినా కేంద్ర ప్రభుత్వానికి నిరుద్యోగ యువతపై చీమకుట్టినట్టు కూడా స్పందన లేదు. ఎన్నికల సమయంలో ఏడాదికి రెండు కోట్ల కొత్త ఉద్యోగాలు ఇస్తానని వాగ్దానం చేశారు. ఈ లెక్కన ఇప్పటికే 18 కోట్ల ఉద్యోగాలు రావాలి.

> 2014 నాటికి 389 ప్రభుత్వరంగ సంస్థల్లో 16.9 లక్షల ఉద్యోగులు ఉంటే, 2022 నాటికి ఆ సంఖ్య 14.6లక్షలకు తగ్గింది. ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలతో పాటు ఇతర బడా కార్పొరేటు సంస్థలకే కట్టబెట్టడంతో ఉన్న ఉపాధి అవకాశాలు కూడా మాయమయ్యాయి. మన ప్రధాని మోదీ తన శక్తి యుక్తులన్నీ కార్పొరేట్ వర్గాల ఎదుగుదలకే వినియోగించారు. వారి అడ్డగోలు వ్యాపార దోపిడీకి, మోసాలకు వెన్నుదన్నుగా, అండగా నిలిచారు.

మనదేశ నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టాలంటే, కనీసం ఏటా 80 లక్షల చొప్పున కొత్త ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉంటుందని ప్రపంచ బ్యాంకు నివేదిక గతంలోనే వెల్లడించింది. ఎప్పటికప్పుడు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలని, ఉపాధి హామీ చట్టానికి నిధులు అధికంగా కేటాయించాలని దేశ,విదేశీ ఆర్థిక రంగ నిపుణులు సూచించినా మోదీ ప్రభుత్వం లక్ష్యపెట్టదు. అలాంటి సలహాలు ఇచ్చిన ఆర్‌బీఐ ఉన్నత శ్రేణి అధికారులు ఇంటిదారి పట్టారు.

మోదీ దృష్టి మొత్తం మీడియా కవరేజీ పై మాత్రమే ఉంటుంది. ఎవరైనా దేశం ఎదుర్కొనే సమస్యలపై ప్రశ్నిస్తే వారంతా దేశద్రోహులు, అర్బన్ నక్సలైట్లు, పాకిస్తానీ ఏజెంట్లు అని ముద్ర వేస్తారు. వారిని జైళ్లలో వేసి అక్రమ కేసులు పెడుతారు. ప్రభుత్వ ఉద్యోగులు, దర్యాప్తు సంస్థలు సకల స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలూ, బీజేపీ చెప్పుచేతల్లో నడవాల్సిందే. రాబోయే ఎన్నికల్లో యువతరం, దేశ ప్రజలు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ,బీసీ,మైనారిటీ పేద ప్రజలు, మధ్యతరగతి వర్గం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. విజ్ఞత, వివేచన, విచక్షణతో ఓటు వేసే బాధ్యత వారికే వదిలేయాలి.